క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి గురువారం తెలిపారు. సమావేశానికి ఎక్స్ అఫీషియోగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారన్నారు. అజెండాలోని అన్ని అంశాలపై చర్చించి ఆమోదించటం జరుగుతుందన్నారు. అన్ని వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సెక్షన్ హెడ్లు హాజరుకావాలని కోరారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి రామాలయం, వెంకటేశ్వరస్వామి దేవాలయం, రైల్వే స్టేషన్ రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ రోడ్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీవారికి మలయప్ప అలంకారం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సరస్వతి శిశుమందిర్‌ను సందర్శించిన ఎంపీ



అమరావతి: స్థానిక సరస్వతి శిశుమందిర్ పాఠశాలను మధ్యప్రదేశ్ రాష్ట్ర రాజ్యసభ సభ్యులు అజయ్‌ప్రతాప్ సింగ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల పరిసరాలను నిశితంగా పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ కలిగించడంలో శిశు మందిరాల కృషి అభినందనీయమన్నారు. ఇక్కడ చదువుతున్న విద్యార్థులు దేశభక్తితో క్రమశిక్షణతో మంచి పౌరులుగా ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోలా వెంకటేశ్వరరావు, పాఠశాల సభ్యులు గాజుల నరేంద్ర, నేరెళ్ల హనుమంతరావు, మద్దిదాత్రి నారాయణ, కోయ సురేష్ పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

ఎస్ఐ కె.అమీర్

బెల్లంకొండ: నూతన సంవత్సర వేడుకలను యువత ఎటువంటి గొడవలు, అల్లర్లు లేకుండా జరుపుకోవాలని ఎస్ఐ కె.అమీర్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైన అవాంఛనీయ ఘటనలు జరిగితే అందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 31న రాత్రి తప్పనిసరిగా అన్ని చోట్లా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతామని తెలిపారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపవద్దని సూచించారు. గ్రామాలలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవాలంటే తప్పనిసరిగా పోలీసు, పంచాయతీ అధికారుల అనుమతులు తీసుకోవాలని సూచించారు.

నకిలీ విత్తనాలతో మోసపోయా.. పరిహారం ఇప్పించండి



అచ్చంపేట: ఆరుగాలం ఇంటిల్లిపాది కష్టపడి మిర్చితోట వేశాం. కంపెనీవాళ్లు, షాపువాళ్లు నకిలీ విత్తనాలు అంటగట్టి నిలువునా మోసం చేశారు. పంట వేసి మూడు నెలలైనా ఇంతవరకు 10కిలోలు కూడా దిగుబడి లేదని మండలంలోని పుట్లగూడెం గ్రామానికి చెందిన కోటకొమ్ముల సత్యనారాయణ అనే రైతు గురువారం విలేకరులకు మొరపెట్టుకున్నారు. జగ్గయ్యపేటలోని ఓ విత్తనాల షాపులో యుఎస్ అగ్రిసీడ్స్‌కు చెందిన 450 హైబ్రీడ్ రకం మిర్చి విత్తనాలను ప్యాకెట్ రూ.750 చొప్పున 30 ప్యాకెట్లు కొనుగోలు చేసి తానే స్వయంగా నారుమడి పెంచినట్లు తెలిపారు. రెండెకరాలలో మొక్కలు నాటానన్నారు. మొక్కలుమొలవకపోవడంతో అచ్చంపేటలో కొనుగోలు చేసిన తేజా రకం మొక్కలు నాటానన్నారు. పంట ఏపుగా పెరిగిందని, కానీ పూత రాలిపోవడంతో కాయ పడలేదన్నారు. తేజా రకం మొక్కలు మాత్రం బాగానే కాపుకొచ్చాయన్నారు. తేజారకం మొక్కలు కాపుకు రావడం, నారుమడివేసి పెంచిన మొక్కలు కాపుకు రాకపోవడం చూస్తే డీలరు, కంపెనీ ప్రతినిధులు తనకు నకిలీ విత్తనాలు అంటగట్టారన్నారు. ఇదే రకం విత్తనాలు తాళ్లచెరువులో సుమారు 50 ఎకరాలలో వేశారని, వారి పరిస్థితికూడా ఇదే విధంగా ఉందన్నారు. వేరే రకం విత్తనాలు వేసిన రైతులు ఇప్పటికి రెండు కోతలు కోసి మూడవ కోతకు కూడా సిద్ధంగా ఉన్నారని, వారికి సుమారు ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందన్నారు. పెట్టుబడులు ఎక్కువై, కూలీరేట్లు పెరగడంతో చేసిన అప్పులతో తల్లడిల్లిపోతున్నామని, వ్యాపారస్తులు, కంపెనీవారు కుమ్మక్కై, అధిక దిగుబడులు వస్తాయని నమ్మబలికి నకిలీ విత్తనాలు అంటగట్టారని వాపోయారు. దీనిపై స్పందనలో జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. అధికారులు, పాలకులు వెంటనే స్పందించి, విచారించి పరిహారం ఇప్పించాల్సిందిగా కోరారు.

ఉప్పొంగిన క్రీడోత్సాహం

- సత్తా చాటేందుకు 'ఆడుదాం ఆంధ్రా' చక్కటి వేదిక
- క్రీడాకారులను ప్రోత్సహించేందుకే పోటీలు
- మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి
- మూడో రోజు ఉత్కంఠగా సాగిన పోటీలు
- హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు



పట్టణంలో బ్యాడ్మింటన్ పోటీలను వీక్షిస్తున్న కమిషనర్ షమ్మి



పట్టణంలో ఖోఖో పోటీల్లో మహిళలు



పెదమక్కెనలో ఖోఖో పోటీల్లో క్రీడాకారులు



నందిగామలో కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు



పెదకూరపాడులో కబడ్డీ పోటీలు ఉత్కంఠంగా సాగుతున్న దృశ్యం



పెదకూరపాడులో వాలీబాల్ పోటీల్లో ఉత్సాహంగా క్రీడాకారులు

సత్తెనపల్లి: క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించేందుకు 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు చక్కటి వేదికని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి అన్నారు. పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడామైదానం, ప్రగతి పాఠశాల క్రీడా మైదానం, వావిలాల గోపాలకృష్ణయ్య ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న క్రీడా పోటీలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వార్డు/ గ్రామ స్థాయి నుంచి క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహిస్తుందన్నారు. గ్రామ/ వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీలో వివిధ దశల్లో 47 రోజుల పాటు పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,500 సచివాలయాల పరిధిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని క్రీడా కారులు సద్వినియోగం చేసుకొని, తమ ప్రతిభ, నైపుణ్యాలను ప్రదర్శించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు, తదితరులున్నారు.

గ్రామాల్లో విశేష స్పందన..

గ్రామాల్లో క్రీడోత్సాహం ఉప్పొంగింది. సత్తెనపల్లి మండలంలోని ప్రతి గ్రామంలో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలకు కనీవినీ ఎరుగని రీతిలో విశేష స్పందన లభిస్తుంది. 15 ఏళ్లు పైబడిన యువత ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఎవరికివారు తమదే గెలుపు అన్నట్లు తమలో దాగివున్న క్రీడా నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. క్రీడాకారులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎంపీడీవో జీవీ సత్యనారాయణ నేతృత్వంలో నోడల్ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీడీలు, పీఈటీలు, కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

రసవత్తరంగా ఆడుదాం ఆంధ్రా

పెదకూరపాడు: పెదకూరపాడు నియోజకవర్గ వ్యాప్తంగా మూడవ రోజు ఆడుదాం ఆంధ్రా పోటీలు రసవత్తరంగా కొనసాగాయి. క్రికెట్, కబడ్డీ పోటీలను చూసేందుకు ప్రజలు తరలివచ్చారు. పెదకూరపాడులోని జెడ్పీ పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరిగిన పోటీలు ఉత్కంఠంగా సాగాయి. ఆయా సచివాలయ పరిధిలోని జట్లు క్రీడాస్ఫూర్తిని చాటుతూ మంచి పోటీని ఇచ్చారు. బ్యాడ్మింటన్ పోటీల్లో పెదకూరపాడు-2, పెదకూరపాడు-3, కబడ్డీ పోటీల్లో పెదకూరపాడు-2, ముస్సాపురం, కాశిపాడు, బలుసుపాడు, వాలీబాల్ పోటీల్లో లగడపాడు, కంభంపాడు, క్రికెట్‌లో హుస్సేన్‌నగరం , ముస్సాపురం సచివాలయ పరిధిలో జట్లు గెలుపొందాయి. ఈ పోటీల్లో స్పోర్ట్స్ ఇన్‌చార్జి నాగరాజు, ఎంపీడీవో నరసింహరావు, ఎంఈవో సత్యనారయణ, హెచ్‌ఎంలు రమణ, శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శులు రహ్మాన్, కీర్తి, షేక్ ఆరిఫ్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలలో 4 టీమ్‌లు..

అచ్చంపేట: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు గ్రౌండ్‌లో అచ్చంపేట సచివాలయం-2 పరిధిలో గురువారం జరిగిన క్రికెట్ పోటీలలో నాలుగు టీమ్‌లు పాల్గొన్నాయి. పోటీలను గ్రామ సర్పంచ్ కంభాల వీరబాబు ప్రారంభించారు. అచ్చంపేట-1, 2 టీముల మధ్య జరిగిన 10 ఓవర్ల మ్యాచ్ రసవత్తరంగా జరిగింది. ఇరు జట్లకు చెందిన క్రీడాకారులు బ్యాటింగ్, బౌలింగ్‌లో విశేష ప్రతిభ కనబరిచారు. శుక్రవారం కూడా పోటీలు జరుగుతాయని పాఠశాల పీడీ ఆలపాటి సుజాత తెలిపారు. కార్యక్రమంలో 50మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా ఆడుదాం ఆంధ్రా

నకరికల్లు: ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు మండలంలో ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. మండలంలోని 14 సచివాలయాల పరిధిలో కబడ్డీ, వాలీబాల్, షటిల్, ఖోఖో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. ఆయా సచివాలయాల కార్యదర్శులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, క్రీడా ఉపాధ్యాయులు పోటీలను పర్యవేక్షిస్తున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం షటిల్, ఖోఖో పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. పీడీ చింతా పుల్లయ్య పోటీలను పర్యవేక్షించారు.



నకరికల్లులో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ వీరబాబు

ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో మహిళలు సత్తాచాటాలి

క్రోసూరు: ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో మహిళలు తమ సత్తాచాటాలని పంచాయతీ విస్తరణాధికారి పి.శివరామయ్య అన్నారు. గురువారం మండలంలోని 15 సచివాలయాల్లో మహిళా జట్లతో క్రీడలు నిర్వహించటం జరిగింది. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, క్రికెట్, షటిల్ ఆటలు ఆడారు. మొత్తం 43 జట్లు పాల్గొన్నాయి. క్రోసూరు, ఊటుకూరులో జరిగిన మహిళల ఆటలను ఈవోపీఆర్డీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల్లో మహిళలు సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యే విధంగా మంచి జట్లను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు జెడ్పీ పీడీ శ్రీధర్, పంచాయతీ సెక్రటరీ పంతులు నాయక్, సచివాలయ సెక్రటరీ ఖాజావలి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



క్రోసూరు జెడ్పీపాఠశాల గ్రౌండ్‌లో వాలీబాల్ ఆడుతున్న మహిళా జట్లు

ఖోఖో అంటే నాకు చాలా ఇష్టం..



నేను చదువుకునేటప్పుడు ఖోఖో ఆటల్లో పాల్గొనేదాన్ని, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఆటలకు ఖోఖో ఆడేందుకు పేరు రిజిస్టర్ చేసుకున్నాను. ఆటలు ఆడుతుంటే గతం గుర్తుకొచ్చింది. నాకు సంతోషంగా ఉంది.

సీహెచ్ పద్మావతి, క్రోసూరు

వాలీబాల్‌లో ప్రతిభ చాటుతాను..



నాకు వాలీబాల్ ఆటలో మంచి ప్రావీణ్యత ఉంది. ఆడుదాం ఆంధ్రా ఆటల్లో మంచి జట్టులో ఎంపికవుతానన్న నమ్మకముంది. మహిళలు కూడా అన్ని రంగాల్లో ముందున్నట్లుగా ఆటల్లో కూడా ఉండాల్సిన అవసరం ఉంది.

గోకన లక్ష్మీగాయత్రి, క్రోసూరు

వరిలో పంటకోత ప్రయోగం



చేజర్లలో పంటకోత ప్రయోగం చేస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి దేవదాసు, సిబ్బంది

నకరికల్లు: వరిపంట దిగుబడిని అంచనా వేసేందుకు పంటకోత ప్రయోగం చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని చేజర్ల గ్రామంలో గురువారం వరిలో పంటకోత ప్రయోగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఈవూరి వెంకటరెడ్డి అనే రైతుపొలంలో బీపీటీ 5204 రకం వరిని పంటకోత ప్రయోగం చేయగా 25 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 17.900 కేజీలు వరి ధాన్యం వచ్చిందన్నారు. గాడిదమళ్ల చిన్న సింగరయ్య రైతుపొలంలో 25చదరపుమీటర్ల విస్తీర్ణంలో వరికోసి నూర్పి కాటా వేయగా 18.950కేజీల దిగుబడి వచ్చిందన్నారు. దీనినిబట్టి ఎకరాకు సగటున 35బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్ఏ వి.వంశీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలు



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

క్రోసూరు: భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జై భారత్ స్కూల్‌లో గురువారం వక్తృత్వ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జైనేంద్రరెడ్డి, బ్యాంకు మేనేజరు గిరిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతపై వివరణాత్మకంగా విద్యార్థులకు తెలియ చెప్పారు. అనంతరం ఆర్థిక అభివృద్ధిలో బ్యాంకుల పాత్ర, అవినీతిని ఏవిధంగా నిర్మూలించాలన్న అంశాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ బహుమతి బి.భవిత, ద్వితీయ బహుమతి హర్షిత, తృతీయ రమ్యశ్రీ, కన్సోలేషన్ బహుమతులు నాగసాయి, ప్రణతిలకు ఆయన అందజేశారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులను బ్యాంక్ మేనేజర్, జైభారత్ స్కూల్ డైరెక్టర్, ఉపాధ్యాయులు అభినందించారు.

మైనార్టీలను ఆదుకుంది వైఎస్ కుటుంబమే

అమరావతి: నాడు తండ్రి 4శాతం రిజర్వేషన్ కల్పిస్తే, నేడు తనయుడు మసీదులలో ఇమామ్, మౌజమ్‌లకు నెలనెలా గౌరవవేతనం ఇస్తూ ముస్లిం, మైనార్టీలను ఆదుకుంది వైఎస్ కుటుంబమేనని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ ఇమామిహాస్సేన్ అన్నారు. గురువారం అమరావతిలో మండల పరిధిలోని ఇమామ్, మౌజమ్‌లతో పాటు మసీదుల నిర్వాహకులకు హర్ దిల్ మే వైఎస్సార్-హమ్‌సబ్ జగన్ కే సాథ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలను ఎంతో ఆదరించి వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మసీదులలో పనిచేసే ఇమామ్‌లకు, మౌజమ్‌లకు నెలనెలా గౌరవవేతనం ఇస్తున్నారన్నారు. మండలంలో 19 మసీదుల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. అలాగే ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సహకారంతో నియోజకవర్గంలో కోట్లరూపాయల ఖర్చుతో షాదీఖానాలు నిర్మాణం చేస్తున్నారన్నారు. గత టీడీపీ హయాంలో కంటే నేడు జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధిని మైనార్టీసోదరులు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ షేక్ హష్మీలతో పాటు 19మసీదుల ఇమామ్‌లు, మౌజమ్‌లు, నిర్వాహకులు పాల్గొన్నారు.



స్థానిక మదీనా మసీద్ వద్ద ప్రభుత్వ పథకాల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రైతులకు వైఎస్సార్ జలకళ విద్యుత్ మోటర్లు పంపిణీ

రాజుపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జలకళ గ్రామీణ ప్రాంత చిన్న, సన్నకారు రైతులకు ఎంతగానో ఉపయోగపడిందని ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డిలు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ జలకళ ద్వారా ఉచితంగా బోరులు వేసిన రైతులకు ఉచితంగా విద్యుత్ మోటార్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మాట్లాడుతూ గతంలో మండలంలో 17 గ్రామ పంచాయతీలకు గాను 217 మంది బోర్‌లు వేసుకునేందుకు దరఖాస్తు చేసుకోగా 85 మంది రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులుగా ఆమోదం పొందారు. గణపవరం, రాజుపాలెం, ఉప్పలపాడు గ్రామాలకు చెందిన 27 మందికి మొదటి విడతగా ప్రభుత్వం ఉచితంగా బోర్లు వేయడం జరిగింది. ఉచితంగా కరెంట్ సప్లై ఇవ్వడం జరిగింది. విద్యుత్ సప్లై చేసిన ఆరుగురు రైతులకు విద్యుత్ మోటార్లు ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. ఎంపీడీవో టి.శ్రీనివాసరావు, సర్పంచ్ పులిబండ్ల అశోక్, ఏపీవో సీహెచ్ వెంకటేశ్వర్లు, సత్తెనపల్లి ఏపీడీవో పొత్తూరి వెంకటనారాయణ, ఎన్‌ఆర్‌జీసీ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు విద్యుత్ మోటార్లు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

అందరికీ ఆరోగ్య భద్రతే సీఎం జగన్ లక్ష్యం

- మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి
- పట్టణంలో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ

సత్తెనపల్లి: అందరికీ ఆరోగ్య భద్రత కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం పరిమితిని రూ.25 లక్షలకు పెంచారని మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి అన్నారు. పట్టణంలోని 25వ వార్డులో గురువారం వైఎస్సార్ ఆరోగ్య శ్రీ నూతన కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య వ్యయ పరిమితి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఇప్పటి వరకు పేద వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే వైఎసాస్సర్ ఆరోగ్య శ్రీ పథకం ఇప్పుడు మధ్యతరగతి కుటుంబాలకు వర్తింప చేస్తున్నారన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు మాట్లాడుతూ పేదలకు సంజీవని లాంటి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకంలో చికిత్సల వ్యయ పరిమితి రూ.25 లక్షలవరకు పెంచుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం, కొత్త ఫీచర్లతో కూడిన స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేయడం అభినందించాల్సిన విషయమన్నారు.



వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డులు చూపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి

కుష్ఠు వ్యాధి నిర్మూలనలో భాగస్వాములు కండి

ముప్పాళ్ళ: కుష్ఠు వ్యాధి నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ అన్నారు. మండలంలోని తొండపి గ్రామంలో వైద్య సిబ్బంది చేపడుతున్న కుష్ఠు వ్యాధి నివారణ సర్వేను గురువారం పరిశీలించారు. వలంటీరు, ఏఎన్ఎం, వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబసభ్యుల నుంచి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు కనిపిస్తే వెంటనే పీహెచ్‌సీకి తీసుకురావాలన్నారు. ప్రతి గ్రామంలోను వైద్య సిబ్బంది సర్వే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో జీసీడీవో విచారణ



నకరికల్లు: స్థానిక కేజీబీవీలోని విద్యార్థిని పాముకాటుకు గురైన ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని జీసీడీవో (గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) రేవతి అన్నారు. స్థానిక కేజీబీవీలోని విద్యార్థిని సమీరా ఈనెల 19న పాముకాటుకు గురైన విషయమై గురువారం పాఠశాలకు వచ్చిన ఆమె విచారణ చేపట్టారు. పాఠశాల ప్రాంగణం క్షుణ్ణంగా పరిశీలించారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థినులతో మాట్లాడారు. ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని అన్నారు. ఆమె వెంట సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు భరోసానిస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- రూ.8.45 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

సత్తెనపల్లి: పేదవర్గాలకు ఆర్థిక భరోసా కల్పించేలా ఆరోగ్య శ్రీ తోడ్పాటు అందిస్తుందని, ఆరోగ్యశ్రీ జాబితాలో లేని వ్యాధులకు ముఖ్యమంత్రి సహాయనిధి బాధితులకు ఆర్థిక భరోసానిస్తూ ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సత్తెనపల్లి టౌన్, సత్తెనపల్లి రూరల్, నకరికల్లు మండలాలకు చెందిన ఐదుగురు లబ్ధిదారులకు రూ.8.45 లక్షల విలువైన చెక్కులను గురువారం ఆయన పంపిణీ చేశారు. మంత్రి అంబటి బాధితుల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడుకు చెందిన సరోజినీకి రూ.3 లక్షలు, పెదమక్కెన గ్రామానికి చెందిన వంశీకృష్ణకు రూ.1.80 లక్షలు, నకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామానికి చెందిన గోపు సామ్రాజ్యంకు రూ.1.30 లక్షలు, రూపెనగుంట గ్రామానికి చెందిన మేడా శ్రీనివాసరావుకు రూ.65 వేలు, పట్టణానికి చెందిన పగడాల విజయలక్ష్మీకి రూ.1.70 లక్షల చెక్కులను అందించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, లక్కరాజుగార్లపాడు మాజీ సర్పంచ్ గోపిదేసి శివయ్య, రాజుపాలెం జెడ్పీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సునీతరెడ్డి, రాజుపాలెం మండల నాయకులు మర్రి సుబ్బారెడ్డి, రాజుపాలెం మాజీ ఏఎంసీ చైర్మన్ తోట మోహన్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.



సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

పెండింగ్ అర్జీలను వెంటనే పరిష్కరించాలి

ముప్పాళ్ళ: ఓటు హక్కు పొందేందుకు, సవరణలకు అందిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో గురువారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగా ఓటు హక్కు పొందేందుకు అందిన దరఖాస్తులను విచారణ పూర్తి చేసి ఓటు హక్కు కల్పించాలన్నారు.

ఈవీఎంలపై అవగాహన..

మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. తహసీల్దార్ ఎం.భవానిశంకర్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదులు పాల్గొని ఈవీఎం పనితీరుపై అవగాహన కల్పించారు. ఓటర్లకు వీవీప్యాట్‌లపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. సుమారు వంద మంది చేత ప్రయోగాత్మకంగా ఓటు వేయించారు. కార్యక్రమంలో ఆర్ఐ పవన్‌కుమార్, కపిల్‌దేవ్, వీఆర్వో సుమతి పాల్గొన్నారు.



లంకెలకూరపాడులో వీవీప్యాట్‌లపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ భవానిశంకర్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బెల్లంకొండ: శీతాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండలంలోని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి కోటేశ్వరరావు అన్నారు. గురువారం పీహెచ్‌సీలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చలికాలంలో వచ్చే చర్మ వ్యాధులు పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దోమ కాటు ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, స్వైన్‌ఫ్లూ తదితర విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. అనంతరం సీజనల్ వ్యాధుల బారిన పడకుండా మందులను పంపిణీ చేశారు.

ట్రక్కు తిరగబడిన ప్రమాదంలో వ్యక్తి మృతి

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామానికి చెందిన ఉల్లిగడ్డ కోటేశ్వరరావు(38) తన పొలంలోని ధాన్యం బస్తాలు ఇంటికి చేర్చుకుంటూ ట్రాక్టర్ ట్రక్కు తిరగబడిన ప్రమాదంలో ట్రక్కు కింద పడి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. ఎస్ఐ వి.నరసింహులు తెలిపిన వివరాల మేరకు ఉయ్యందన రోడ్డు మీదగా ధాన్యం బస్తాలు ఇంటికి తరలిస్తుండగా ట్రక్కు అదుపుతప్పి తిరగబడింది. కోటేశ్వరరావు బస్తాల కింద పడి మృతి చెందాడు. మృతుని భార్య తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.